ఏఐటీయూసీని గెలిపించిన బీహెచ్ఈఎల్ ఉద్యోగులకు అభినందనలు

విశాలాంధ్ర - విశాఖ: బీహెచ్ఈఎల్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బిహెచ్ వీవీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్యానెల్ ను గెలిపించిన ఉద్యోగ, కార్మికులకు ఏఐటీయూసీ విశాఖ జిల్లా సమితి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఎం. మన్మధరావు, జి.ఎస్.జే అచ్యుతరావు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ విజయం ఉద్యోగ, కార్మికులు విజయంగా భావిస్తున్నామని తెలిపారు. ఏఐటీయూసీ పట్ల అత్యంత విశ్వాసంతో గుర్తింపు సంఘంగా ఎన్నుకున్నందుకు అభినందనలు తెలియజేశారు. పరిశ్రమ పరిరక్షణే ధ్యేయంగా కార్మిక హక్కులు ఉద్యోగ, భద్రత కోసం ఏఐటీయూసీ అనునిత్యం పనిచేస్తుందని తెలిపారు.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను కారు చౌకగా ప్రైవేటు పెట్టబడుదారులకి అమ్మేందుకు అత్యంత ఉత్సాహపడుతున్న తరుణంలో గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ ప్యానల్ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడుతుందని, తద్వారా కార్మిక హక్కులను కాపాడుతుందని తెలిపారు.

జాముగుడ వంతెన నిర్మించాలి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలోని అసంపూర్తిగా ఉన్న కొర్రాయి పంచాయతీ జాంగూడ వంతెనను మరమ్మతులు చేపట్టి గిరిజనుల రాకపోకలకు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిసిసి కమిటీ సభ్యుడు పి.చిన్నస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులు చేపట్టి సుమారు నాలుగేళ్లు గడుస్తున్నప్పటికి పునాది దశలోనే ఉందన్నారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, జీపులు రవాణకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే వంతెనను పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భీమారావు, కే.రఘురాం, జె.వెంకట్ బాబు పాల్గొన్నారు.

బీసీలపై కక్ష సాధింపులో భాగమే అయ్యన్న అరెస్ట్..!

విశాలాంధ్ర - భీమిలి: అయ్యన్న పాత్రుడుని అరెస్ట్ బీసీలపై కక్షసాధింపులో భాగమేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు వ్యాఖ్యా నించారు. ఢిల్లీ నుండి వచ్చిన టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అరెస్ట్‌పై గంటా నూకరాజు స్పందించారు. బీసీ నాయకుడు చింతకాయల అయ్యన్న పాత్రుడు మాట్లాడిన మాటలపై అంతగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం వైసీపీ పేక్ బ్యాచ్ మాట్లాడిన మాటలపై ఎందుకు పోలీసులు స్పందిం చడం లేదని ప్రశ్నించారు. అరెస్టులు చేస్తే కుంగి పోవడానికి అల్లాటప్పా పార్టీ నాయకులం కాదని, ప్రజల పక్షాన నిలిచిన టీడీపీ వీరాభిమానులమని గంటా నూకరాజు అన్నారు.

కృష్ణాష్టమి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - తగరపువలస: త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 16వ తేదీ వరకు శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, ఎంపీపీ వాసురాజులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాటితూరు సర్పంచ్ సిరిగుడి సంతోషి, ఈశ్వరరావు, శింగనబంద సర్పంచ్ గాడు వెంకటనారాయణ, కనకల గోలుసు అప్పల నాయుడు, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక సభ్యులు రావణ అక్షయ్, బాల కృష్ణ, గణేష్, రమణ, రాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల అగ్నిమాపక కేంద్రాన్ని జిల్లా ముఖ్య అగ్నిమాపక అధికారి ఆర్.వెంకటరమణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది చేసిన డ్రిల్స్‌ను పర్యవేక్షించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ వి.రాజేశ్వరరావు, ఎల్ఎఫ్ కృష్ణ, ఫైర్‌మెన్ మణికుమార్, చిన్నం నాయుడు, నానాజీ పాల్గొన్నారు.

ఘనంగా బొలిశెట్టి గోవిందు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల వైసీపీ సీనియర్ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు ఎస్.రాయవరం ఎంపీటీసీ బొలిశెట్టి గోవిందరావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్ పర్సన్ పి.అమ్మాజీ, ఎంపీపీ కోన లోవ లక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైసీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షులు అల్లాడ నాగరాజు, సర్పంచ్ భూపతి అప్పారావు, ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, వైసీపీ సీనియర్ నాయకులు మధువర్మ, పుట్ట సుధాకర్, కశింకోట నీలాంధ్రరావు పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువ ద్వారా రుణాలు

విశాలాంధ్ర - కశింకోట: జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతులకు రుణాలు అందజేస్తున్నామని కన్నూరుపాలెం పశు వైద్యాధికారిణి డాక్టర్ దయానా అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రుణమేళా కార్యక్రమం నిర్వహిం చారు. డా.దయానా మాట్లాడుతూ మహిళా పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అమూల్ కేంద్రానికి పాలు పోసే ప్రతి ఒక్క రైతు 30 వేల రూపాయలు రుణానికి అర్హులు అని తెలిపారు. సహకార సంఘాల ద్వారా రూ.లక్ష నుండి రూ.1.60 లక్షల వరకు రుణాలు అందిస్తున్నామన్నారు. ఈ రుణాలను తిరిగి 18 వాయిదాలలో చెల్లించవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గణేష్, డీసీసీబీ బ్యాంక్ ప్రతినిధి అచ్చేనాయుడు, అమూల్ ఆర్ఐ సి.బి.గీతావాణి, జేవీఓ కరుణ శ్రీ, పాడి రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - పెదబయలు: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల (1)లో చదువుతున్న వి.చంద్రశేఖర్, పి.అవినాష్ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన స్కూల్ ఇన్నోవేటివ్ ప్రోగ్రాం గ్రాండ్ ఫినాలే జరిగిన పోటీలో ప్రతిభ సాధించినట్లు జిల్లా సైన్స్ అధికారి టి.నాగేశ్వరరావు తెలిపారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయిలో సంబంధించి 3268 సృజనాత్మక ఆలోచనలకు గాను వివిధ దశలలో వడపోత అనంతరం 26 ప్రాజెక్టులు గ్రాండ్ ఫినాలేకు అర్హత సాధించారన్నారు. విజయం సాధించి మెమెంటో, 35 వేల రూపాయలు నగదును కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సురేష్ కుమార్ ఐఏఎస్, ఏపీఎస్సిఆర్‌టి డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా గైడ్ టీచర్ సిహెచ్ బాలకృష్ణ విద్యార్థులు తీసుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంవి నాయుడు, చిరంజీవి, రామకృష్ణ, విశ్వనాథం నాయుడు, మాధవరావు, చక్రధర్, బాలన్న మత్య రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాషా అభినందించారు.

రహదారి, వంతెనకు నిధులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - ముంచిగిపుట్టు: బర్రిగుడ జంక్షన్ నుండి ఉబ్బెంగుల దొరగుడా తారురోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ జేసీకి వినతిపత్రం అందించినట్లు లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కొర్ర త్రినాథ్ తెలిపారు. శుక్రవారం సర్పంచ్ త్రినాథ్ విలేకరులతో మాట్లాడుతూ స్పందించిన జాయింట్ కలెక్టర్ గిరిజన సంక్షేమ ఈఈని నిర్మాణ పనులకు అంచనా వేసి తక్షణం ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. బర్రిగుడ జంక్షన్ నుండి దొరగుడా ఉబ్బెంగులకు రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితులలో ఆసుపత్రులకు వెళ్లాలంటే నకరప్రాయంగా వుందన్నారు. ఉబ్బెంగుల గెడ్డలో బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. వర్షాకాలంలో ఉపాధ్యాయులు, వివిధ ప్రభుత్వ ఉద్యోగులు వైద్య ఆరోగ్య సిబ్బంది మారుమూల ప్రాంతాలకు వెళ్లాలంటే అరచేతులలో ప్రాణం పెట్టుకుని గెడ్డ దాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వి.నిరీక్షణ, వి.మిత్రు సుబ్బారావు, గురుమూర్తి, జీవన్, రంపన్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధన ద్వారానే పోటీ పరీక్షలలో విజయం

విశాలాంధ్ర - మధురవాడ: నిరంతర సాధన, ప్రణాళికాయుతంగా లక్ష్యాన్ని చేరడం ద్వారా పోటీ పరీక్షలలో విజయం సాధించ వచ్చునని యూపీఎస్సీ విజేత డాక్టర్ రాణి సుష్మిత పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం కెరీర్ గైడెన్స్ సెంటర్ శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి విద్యార్థికి జీవితంలో ఏదైనా సాధించాలన్న లక్ష్యం ఉండాలని, అది సాధించడానికి ప్రణాళికాయుత కృషి జరపాలని సూచించారు. సివిల్ సర్వీస్ వంటి అత్యున్నత పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి నిరంతర సాధనే కీలకమని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు తాము ఎంచుకున్న సబ్జెక్టులో లోతైన పరిజ్ఞానాన్ని పెంచుకోవడం, ప్రణాళికాయుతంగా అధ్యయనం చేయడం, లక్ష్యసాధనకు నిరంతర కృషి చేయడం ద్వారా ఏ రంగంలో అయినా రాణించడానికి దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ అదర్ కెరీర్ అప్షన్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.రవికాంత్ పాల్గొన్నారు.

అయ్యన్నను పరామర్శించిన టీడీపీ నేత పైలా

విశాలాంధ్ర - వి.మాడుగుల: తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీసే లక్ష్యంగా టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడి అక్రమ అరెస్టుని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు ఖండించారు. ఈ మేరకు శుక్రవారం నర్సీపట్నంలోని అయ్యన్నపాత్రుడి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ అక్రమ కేసులు, వేధింపులు వైసీపీ దుర్మార్గపు చర్యలకు పరాకాష్ట అని అన్నారు. వైసీపీ దుష్టపాలనను ఎదుర్కొని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అయ్యన్న చేస్తున్న పోరాటాన్ని ప్రతీ తెలుగుదేశం కార్యకర్త స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వైకాపా ప్రభుత్వ పెద్దలకు పాలన చేతకాక టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టులు చేయిస్తున్నారన్నారు. ప్రతిరోజూ చంద్రబాబు, లోకేష్‌పై వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు అసభ్య పదజాలంతో దూషిస్తున్నా వారిని ప్రోత్సహిస్తారని, ప్రతిపక్ష నేతలైతే మాత్రం ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని అన్నారు. విశాఖ ఎయిర్ పోర్టులో అయ్యన్నను హనుమాన్ జంక్షన్ పోలీసులు మఫ్టీలో అరెస్టు చేసి తరలించే ప్రయత్నం చేసారని, హైవేలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అడ్డుకోవడంతో నోటీసు ఇచ్చి వేంపాడు వద్ద విడిచిపెట్టారన్నారు. ఈ తరహా దుర్మార్గపు చర్యలతో ప్రభుత్వంపై ప్రజల్లో మరింత విసుగుపుడుతుందని ఆయన అన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - ఆనందపురం: జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 2వ తేదీ శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు భీమిలి జనసేన పార్టీ ఇన్చార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్ల తెలిపారు. ఆనందపురం మండలం రూరల్ జనసేన పార్టీ కార్యాలయంలో విజయ శ్రీ బ్లడ్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఉదయం 9 గంటలకు మహా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా పంపిణీ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో వరుసగా ఐదో ఏడాది మొదటి విడతగా కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా పథకం విడుదల చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వె.యస్.జగన్మోహన్ రెడ్డి శుక్రవారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వరుసగా 5వ ఏడాది మొదటి విడతగా కౌలు రైతులకు రూ.7500 చొప్పున 1,46,324 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బి.సి, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులు, దేవాదాయ భూములు సాగుదారులకు కలిపి రూ. 109.74 కోట్లు వైఎస్ఆర్ రైతు భరోసా పథకం క్రింద బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన 28 మంది కౌలు రైతు కుటుంబాలకు వైఎస్ఆర్ రైతు భరోసా క్రింద రూ.2.10 లక్షల లబ్ది చేకూరిం దన్నారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, జాయింట్ కలెక్టర్ కె.యస్. విశ్వనాథన్, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని వేగవంతం చేయాలి

మంత్రి పీడిక రాజన్న దొర

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా పూర్తి చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పెందుర్తి నియోజకవర్గ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలందరికీ పథకాలు సక్రమంగా అందించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గడపగడపకు ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు వారి ప్రోగ్రెస్ తెలియజేస్తూ ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలన్నారు. వీలైతే దాని పరిష్కారాన్ని కూడా సూచించవచ్చని చెప్పారు. పెందుర్తి శాసనసభ్యులు అదీప్ రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత పనులన్నీ నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గానికి సంబంధించి సబ్బవరం, పరవాడ మండలాల్లో చేపట్టిన జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణం, తాగునీటి సరఫరా, రోడ్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమీక్షించారు. సబ్బవరం మండలంలో క్రైస్తవులకు శ్మశానం కొరకు తగిన స్థలాన్ని వేగంగా కేటాయించాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్ఓ ఎస్‌డి అనిత, సిపిఓ జి.రామారావు, ఆర్డీవో ఏ.చిన్నికృష్ణ, డ్వామా పిడి సందీప్, డీఎఫ్ఓ జి.లక్ష్మణ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అరట్లకోటలో చెత్త తొలగింపు

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని అరట్లకోట గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద నిల్వ ఉంచిన చెత్తను పంచాయతీ అధికారులు తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. చెత్తతో రోగాలు - పట్టించుకోని అధికారులు అనే వార్త విశాలాంధ్రలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎంపీడీవో సాంబశివరావు అరట్లకోటలో నిల్వ ఉన్న చెత్తలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని పంచాయితీ కార్యదర్శి డి.విజయరాజును ఆదేశించారు.

ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి డి.విజయరాజు గ్రామంలో నిల్వ ఉన్న చెత్తలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద ఉన్న చెత్తను తగలబెట్టారు. ఆ ప్రదేశంలో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు చెత్త వెయ్యరాదని ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు.

అధిక ధరల భారంపై సీపీఎం ఆందోళన

విశాలాంధ్ర - పరవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల వలన ప్రజలపై రోజు రోజుకీ భారాలు పెరుగుతున్నాయని సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యధర్శి కె.లోకనాధం అన్నారు. అధిక ధరలపై శుక్రవారం దేశపాత్రునిపాలెం సచివాలయం వద్ద ధర్నా నిర్వహించి మాట్లాడారు. నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ భారాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ ఛార్జీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాల్సిన లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వివి రమణ, వి.మాణిక్యం, పిడి నాయుడు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలను తగ్గించాలని సీపీఎం

ఆధ్వర్యంలో సచివాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు, నిత్యావసర ధరలు అమాంతం పెరుగుతున్నాయని, వంట గ్యాస్ ధర 450 నుంచి 1250 రూపాయలకు పెంచి మళ్లీ 200 తగ్గించామని గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టడమేనని అన్నారు. జీవో నెంబర్ 3ని పునరుద్ధరణ చేసి ఆదివాసి స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. పెదలబుడు పంచాయతీ సచివాలయ పరిధిలో ప్రతిరోజు మంచినీటి సరఫరా చేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జగన్నాథం, మగ్గన్న, హరి, రాము, సహదేవ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై

ప్రభుత్వాలు అవలంబిస్తున్న తీరుపై సీపీఎం ఆధ్వర్యంలో బీరం పంచాయతీ వనేల్బ, బొడ్డపుట్టు, వి.కోడాపల్లి తదితర ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. బీరం సచివాలయ సిబ్బందికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి సాగిన ధర్మన్న పడాల్ మాట్లాడుతూ జీవో నెంబర్ 3 రిజర్వేషన్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని అన్నారు. గ్రామాలలో త్రాగునీరు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు వంట మౌలిక సమస్యలు పరిష్కరిం చాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ధర్మారావు, రామన్న, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీనుల విందుగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి సన్నిధిలో ఆర్జిత సేవలు జరిగాయి. ఉదయం స్వామివారి సన్నిధిలో ఉన్న సింహవల్లి తాయర్‌కు లక్ష కుంకమార్చన, గోవింద రాజుల అలంకరణలో ఉన్న సింహాద్రి నాధునికి నిత్యకల్యాణం సేవలు వీనుల విందుగా జరిగాయి. ఆలయ ఏఈఓ సూర్య భ్రమరాంబ, పర్యవేక్షకులు సునీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. నిత్యకల్యాణం అనంతరం శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

చౌడువాడలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలంలోని మేజర్ పంచాయితీ చౌడువాడ గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఏపీ పంచాయతీ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి, చౌడువాడ గ్రామ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు కోరారు. ఢిల్లీలోని రఫీ మార్గ్‌లో గల శ్రమశక్తి భవన్లో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి.సాయిబాబాని కలసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట అఖిల భారత పంచాయితీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, ఏపీ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తపు ముని రెడ్డి, సంయుక్త కార్యదర్శి జి.మాల్యాద్రి నాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి: సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నీరు లేక నారుమడులు సైతం పూర్తిగా ఎండిపోయాయని అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వై.ఎన్.భద్రం డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయం కోడిగంటి గోవిందరావు భవన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నడు లేని విధంగా ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని అధిక శ్రమకోర్చి నాట్లు వేసిన రైతులకు తీవ్ర నిరాశే మిగిలిందన్నారు. వెంటనే ప్రభుత్వం రైతులకు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ద్వారా రైతులకు వడ్డీ లేనిరుణాలు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ, రైతు సంఘం నాయకులు తాకాసి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, కోరుబిల్లి శంకర్రావు, మత్తుర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - దేవరాపల్లి: ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు వేమల కన్నబాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం దేవరాపల్లి సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కన్నబాబు మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో నిరుద్యోగ వ్యవస్థను నిర్మూలిస్తానని యువతకు హామీ ఇచ్చారన్నారు. జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేస్తామని చెప్పి యువతను మోసం చేశారన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ కూడా లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వివిధ శాఖల్లో ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని కన్నబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, సంజీవ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించాలి: కిడారి

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండలం వాలసి పంచాయతీ కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షులు అంటిపర్తి బుజ్జిబాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొని టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టీడీపీని గెలిస్తేనే ప్రజల భవిష్యత్ ఉంటుందని రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు మరిచిందన్నారు. దీపం పథకం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. మహిళల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు టీడీపీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు సివేరి అబ్రహం, మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ అప్పారావు, ఆనంద్, మొస్య జోగులు, బిడ్డ లక్ష్మణరావు, దయానిధి, సుందరరావు, నగేష్, లచ్చన్న, కామేష్, వెంకట్రావు, పండన్న, కిలో కృష్ణ, సన్నిబాబు, తిరుపతిరావు, దేముడు, వీరన్న, దొర, హరి పాల్గొన్నారు.

'పరిశీల'లో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: మండలంలోని కితలంగి గ్రామపంచాయతీ పరిధిలో గల పరిశీల గ్రామంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి గోపాల్ ఆధ్వర్యంలో ఆ పంచాయతీ సర్పంచ్ వరబోయిన సుబ్బారావు పర్యవేక్షణలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. గిరిజన అభివృద్ధికై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాగా ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు సిహెచ్ జానకమ్మ, వైసీపీ మండల మహిళా అధ్యక్షురాలు బంగురు శాంతి, మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎం.శ్రీరాములు, ఆ పార్టీ నాయకులు బాకా సింహాచలం, సిహెచ్ కృష్ణారావు, మల్లేష్, అరకు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ నర్సింగరావు, పోతంగి గ్రామ పంచాయతీ సర్పంచ్ వంతల వెంకటరావు, ఉప సర్పంచ్ శెట్టి జగ్గనాయుడు (జగన్) తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం ఆందోళన

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని అరకు పంచాయతీ సచివాలయ అధికారులకు ఆ పార్టీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో వంద శాతం రిజర్వేషన్ కల్పించిన జీవో నెంబర్ 3ను చట్టబద్ధత తీసుకొచ్చి ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేసి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించి, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని, మోడీ సర్కార్ తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గసభ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్, ఆ పార్టీ నాయకులు వి.ధర్మ, వి.సింహాద్రి, పి.సారేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం మండలంలోని వివిధ పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కోశాధికారి గండి నాయిని బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలికి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎర్ర దేవుడు, వనము సూర్యనారాయణ పాల్గొన్నారు.

అనంతగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై వ్యతిరేకిస్తూ కిల్లో మోస్య సర్పంచ్ అధ్యక్షతన సచివాలయ కేంద్రాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. టోకురు, పైనంపాడులో కూడా నిరసన చేపట్టారు. సీపీఎం రాష్ట్ర కేంద్రం దడల సుబ్బారావు, అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జి.ఓ నెం.3 రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించి ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగుల సమస్యను పరిష్కరించాలన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలన్నారు. పివిటిజి గిరిజనులకు రేషన్ కార్డులు, అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని, అటవీ హక్కుల పత్రాలు ఇవ్వాలని, విద్యుత్ చార్జీలు, అధిక ధరలు అరికట్టాలని, విభజన చట్టం హామీలు అమలు చేయాలని అన్నారు. భాష వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు." ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, సివేరి కొండలరావు, నందల రామరాజు, సరాజీ సురేష్ పాల్గొన్నారు.

పెదబయలు: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 4వ తారీఖున ఎమ్మార్వో కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు పెద్ద సంఖ్యలో గిరిజనులు హాజరై విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే సురేంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం అడుగులపుట్టు పంచాయతీ వడ్డేపుట్ గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.సురేంద్ర మాట్లాడుతూ జీవో నెంబర్ 3 రిజర్వేషన్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, నిత్యావసర సరుకులు అధిక ధరలను తగ్గించాలని కరెంటు చార్జింగ్ తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కె సర్భన్న, బి.గంగాధర్, కె.నర్సయ్య రాజు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: జీవో నెంబర్ 3ని పునరుద్ధరించి చట్టబద్ధత కల్పించాలని సిపిఎం నేత అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై సిపిఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా డౌనూరు సచివాలయం వద్ద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఆదివాసి ప్రాంతంలో స్పెషల్ డిఎస్సీ ద్వారా నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీవీటిజి లకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని మంజూరు చేయాలని వారికి సం క్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. భాషా వాలంటీర్లకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. అన్ని పివిటిజి గ్రామాల్లో భాషా వాలంటీర్లను నియమించాలని మారుమూల గ్రామాలకు రహదారుల సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో 200 పని దినాలు కల్పిస్తూ కనీస వేతనం 600 రూపాయలు ఇవ్వాలని రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వడంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై సంతకాలు చేసిన వినతి పత్రాన్ని సచివాలయ సిబ్బందికి అందజేశారు.

లొంగిపోయిన మావోయిస్టు సభ్యులు

విశాలాంధ్ర - ఎటపాక: జన జీవన స్రవంతిలో కలిసేందుకు మావోయిస్టులు లొంగిపోయారని ఎస్పీ తెలిపారు. అల్లూరి జిల్లా ఎస్పీ ఎదుట అభివృద్ధి కార్యక్రమాలతోపాటు, వివక్షపూరిత సిద్ధాంతాలకు మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలుస్తున్నారని అల్లూరి సీతారామ జిల్లా తుహిన్ సిన్హ అన్నారు. మావోయిస్టు పార్టీకి ఏరియా కమిటీ సభ్యుడితో పాటు సభ్యుడు ఒకరు ఎస్పీ ఎదుట లొంగిపోయారు. చతిస్గడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా, ఉసిరి మండలం గంగనపల్లి గ్రామానికి చెందిన సున్నం నీల అలియాస్ సోనీ 1996లో మావోయిస్టు పార్టీ బాలల సంఘాలలో చేరి 2001లో మావోయిస్టు పార్టీలో చేరిందన్నారు. అనంతరం అటవీ ప్రాంతంలో శిక్షణ పొందిన ఆమె ఆహేరి ఏరియా కమిటీ మెంబర్‌గా నియమించబడిందన్నారు. చైతన్య నాట్య మండలి 15వ ప్లాటూన్‌లోను సభ్యురాలుగా ఉండి పివిసిమ్ ఏసీఎంగా పదోన్నతి పొందారన్నారు. 2009 నుండి 2018 వరకు సౌత్ ఆఫ్ ఏరియా కమిటీకి కమాండర్‌గా పని చేసిందన్నారు. ఆ సమయంలో ఇన్సాస్ వెపన్స్ కలిగిఉందన్నారు. చతిస్గడ్ రాష్ట్రం పామిడి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలగుడం పంచాయతీ జూలూరు గ్రామానికి చెందిన మడివి బుధు 2013లో బాలల సంఘంలో చేరి బెటాలియన్ సప్లై టీమ్ సభ్యుడిగా పని చేసాడన్నారు. 2016 నుండి 2021 వరకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఒకటవ బెటాలియన్ రెండవ బెటాలియన్ కంపెనీ మూడవ ప్లాటూన్ సభ్యుడిగా పనిచేసాడని తెలిపారు. ఆకస్మిక దాడులకు పాల్పడి పదుల సంఖ్యలో భద్రతా దళ సిబ్బంది మరణాలకు కారణమైన సంఘటనలు ఉన్నాయన్నారు. సున్నం నీలకు నాలుగు లక్షల రివర్డు, మడివి బుదుకి లక్ష రూపాయలతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో ఓఎస్డి మహేశ్వర రెడ్డి, సిఆర్పీఎఫ్ 141 బెటాలియన్ కమాండర్ ప్రశాంత్ ధర, సెకండిన్ కమాండర్ ప్రీతీసి, సిఐ గజేంద్ర కుమార్, ఎస్సై పార్థ సారధి పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ, ఎర్నమ్మ, దండుమారమ్మ ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - కొమ్మాది: మధురవాడ మూడు గుళ్ల జంక్షన్ (కొమ్మాది జంక్షన్) కొలువైవున్న శ్రీ బంగారమ్మ బంగారమ్మ, ఎర్నమ్మ, దండుమారమ్మ అమ్మవార్ల ఆలయంలో ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం అలంకరణ చేసి ప్రత్యేక కుంకుమార్చన పుష్పార్చన మొదలగు పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు నిష్ఠల రాంబాబు తదితరులు జరిపించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో కె.రామకృష్ణ బృందం వారిచే ఏర్పాటు చేసిన భక్తిరంజని కార్యక్రమం భక్తులను శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలో భక్తులు ఆలయ కమిటీ సభ్యులు ధన సహాయంతో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సెక్రటరీ మొల్లి లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు పిల్లా పాపారావు, కోశాధికారి వాండ్రాసి అప్పలరాజు, జాయింట్ సెక్రటరీ కుడితి రామారావు, సభ్యులు పిల్లా సూరిబాబు, పిల్లా అప్పన్న, యమ్.గణపతిరావు, వాండ్రాసి సన్యాసిరావు, ఇమంది వెంకటరమణ, పోతిన శివ లింగేశ్వరరావు, నమ్మి అప్పలస్వామి, నమ్మి రమణ, మధురవాడ ప్రాంత పెద్దలు పిల్లా లక్ష్మణ, నమ్మి నర్సింహులు, బొట్ట అప్పలరాజు, నాగోతి సత్యంబాబు, పిల్లా చంద్రశేఖర్, నాగోతి సూర్య ప్రకాష్, పోతిన పైడిరాజు, జగుపిల్లి అప్పారావు, పిల్లా లక్ష్మణ పాత్రుడు, పోతిన జగదీష్, బంక పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెంలో పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - ఎటపాక: ఎటపాక మండలం, కన్నాయిగూడెం సచివాలయం పరిధిలో సుమారు 7 కొత్త పింఛన్లు మంజూరు అయినవి. మంజూరైన పింఛన్ దారులకు వై.యస్.ఆర్ పింఛన్ కానుక శుక్రవారం కన్నాయిగూడెం సర్పంచ్ పెనుబల్లి నాగమణి సచివాలయ కన్వీనర్ గొల్లపల్లి శివ బాబు వై.సీ.పీ నాయకులు పెనుబల్లి కోటేశ్వరరావు చేతులమీదుగా పంపిణీ చేసారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో కంటే జగనన్న ప్రభుత్వ హయాంలో వృద్ధులకి, వికలాంగులకు ,వితంతువులకి అదే విధంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకి మెరుగ్గా సామాజిక పింఛన్లు సచివాల వ్యవస్థ ద్వారా అర్హులను గుర్తించి మంజూరు చేసి పంపిణీ జరిగిందని సర్పంచ్, కన్వీనర్ తెలియజేశారు.

ఈ సందర్భంగా వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్ మాట్లాడుతూ ప్రతినెల సచివాలయం పరిధిలో వేరే జిల్లాలకు సంబంధించిన వివిధ సచివాలయాల పరిధికి సంబంధించిన సుమారు 35 మంది వివిధ రకాల పింఛన్ లు పంపిణీ చేయడం జరుగుతుందని, వచ్చే నెల కూడా మరికొన్ని కొత్త పింఛన్లు మంజూరు అవుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ ,డిజిటల్ అసిస్టెంట్ శైలజ వాలంటీర్లు రాజు, శేఖర్ ,నవీన్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల అడ్డాలో మంప ఎస్సై లోకేష్ కుమార్

విశాలాంధ్ర - కొయ్యూరు: అత్యంత మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన యు చీడిపాలెం పంచాయతీ పరిధి మారుమూల గ్రామాల్లో మంప ఎస్సై లోకేష్ కుమార్ పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని యు.చీడిపాలెం పంచాయితీ మారుమూల తీగలమెట్ట గొల్లలబంధ నీలవరం గంగవరం ఎర్రగొండ వై.రామవరం మండలం దదలికవాడ తదితర గ్రామాలను మంప ఎస్సై లోకేష్ కుమార్ వై.రామవరం ఎస్సై సంతోష్ కుమార్ తో కలిసి సందర్శించి అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి సాగుకు దూరంగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి గిరిజనులు శ్రేయస్సుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాలను అభివృద్ధి పనులనుప్రజలకు వివరించారు. మూఢనమ్మకాలను విడనాడాలన్నారు. మావోయిస్టు కార్యకలాపాల్లో పాలుపంచుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దని, మత్తు పదార్థాలకు బానిస కావద్దని హితబోధ చేశారు. ఆయా గ్రామాల గిరిజనులకు మందులతో పాటు యువతకు వాలీబాల్ కిట్లు పిల్లలకు చాక్లెట్లు స్వీట్లు పంపిణీ చేశారు.

హరే కృష్ణ వైకుంఠంలో హెరిటేజ్ పెస్ట్

విశాలాంధ్ర - ఆనందపురం: హరే కృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో హెరిటేజ్ పెస్ట్-2023 కార్యక్రమాన్ని గంభీరం గ్రామం ఐఐఎం రోడ్‌లో 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. 3వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో ఇది అతిపెద్ద సాంస్కృతిక కార్నివాల్ గీతా శ్లోక పఠన 1 నుంచి 4వ తరగతి విద్యార్థులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమములో 63 మంది విద్యార్థులు 7 పాఠశాల నుంచి పాల్గొన్నారు. శ్రీ వారణాసి విశ్వనాథం ఇంద్రకంఠి రామచంద్ర మూర్తి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పెయింటింగ్ 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 305 మంది విద్యార్థులు 14 పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే శనివారం గీతా స్లోక పఠన 5 నుండి 7వ ఈ కార్యక్రమునకు విద్యార్థులు పాల్గొనునున్నారు. ఈ కార్యక్రమంలో అంబరీష దాస, ఆదోషజ దాస, కేశవ కృప దాస, హరి మురారి దాస చిన్నారులను వారి తల్లిదండ్రులను ఆదోషజ దాస అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ నిష్కించిన భక్త దాస పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

విశాలాంధ్ర - మాకవరపాలెం: భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభతరుణంలో భారతీయులందరూ అజాదికా అమృత మహోత్సవం జరుపుకుంటున్నారు. అందులో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారు, అవంతి కళాశాల జాతీయ సేవా సమితి(ఎన్ఎస్ఎస్) సంయుక్తంగా మేరీ మాతా మేరీ దేశ్‌లో భాగంగా శుక్రవారం అవంతి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.ప్రసాదరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బి.గణేష్, ఫిజికల్ డైరెక్టర్ శివ, ఫణివరప్రసాద్, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, ఏఓ దానియల్‌రాజు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి రైతులకు 40 శాతం సబ్సిడీపై చాప్ కట్టర్

విశాలాంధ్ర - చోడవరం: రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకునేందుకు అధికార వైసీపీ ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు యేడువాక సత్యారావు తెలిపారు. గోవాడ పశువుల ఆసుపత్రి వద్ద శుక్రవారం ప్రభుత్వం సబ్సిడీ పై అందజేసిన చాప్ కట్టర్ యంత్రాన్ని లబ్ధిదారులకు సత్యారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ యంత్రం విలువ రూ.33,790 లు కాగా, ప్రభుత్వం రాయతీపై రూ.20,388లకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారిని బి.లిఖిత, బి.సత్యారావు, నాగేష్, దేముడు, శ్రీను, జగన్ పాల్గొన్నారు.

నూతన హౌసింగ్ ఏఈగా మండల గౌరిశంకర్

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలో హౌసింగ్ ఏఈగా మండల గౌరిశంకర్ బాధ్యతలు స్వీకరించారు. మండలంలో హౌసింగ్ డిపార్ట్మెంట్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయనకు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ హుకుంపేట మండలంలోనే హౌసింగ్ ఏఈగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా 582 గృహాలు మంజూరయ్యాయని, వాటిలో 34 పూర్తిగా నిర్మాణం జరిగిందని, 44 గృహాలు ఆర్ లేవల్లో ఉన్నాయని, 126 గృహాలు సగం వరకు నిర్మాణం పూర్తి చేశారని, 275 పునాది స్థాయిలో ఉన్నాయని తెలిపారు. అలాగే నూతనంగా 3400 గృహాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. మండలంలో గృహాల కోసం ఎవరైన ఉంటే దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

18 మందికి నూతన పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు 501 సచివాలయం పరిధిలోని లక్ష్మిపురం, గవరపాలెంలో కొత్తగా మంజూరైన 18 మంది లబ్ధిదారులకు స్థానిక జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతుల మీదుగా శుక్రవారం పింఛన్ సొమ్మును పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమం రాష్ట్రాభివృద్ధి రెండు కళ్ళుగా చేసి పాలన చేస్తున్నారని, కులమతాలు పార్టీలు వర్గాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. పింఛన్ కోసం రోజుల తరబడి కార్యాలయాలు చుట్టూ తిరిగే పరిస్థితి తొలగించి ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎవరు ఎన్ని కుతంత్రాలు పన్నినా జగన్మోహన్ రెడ్డిని ఏమి చేయలేరని, ప్రజాబలం మెండుగా ఉందని వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు,ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జెసిఎస్ ఇంచార్జ్ మనలత జోబ్ దాస్ (చిన్ని),యువజన విభాగం అధ్యక్షులు చిప్పల చందు,పులమరశెట్టి లక్ష్మణ్,పిడివి.ప్రసాద్,మరియు సచివాలయం సిబ్బంది వాలంటీర్స్ పాల్గొన్నారు

కోట్నాపల్లి వీఆర్వో వెంకటరమణ మృతి



విశాలాంధ్ర - హుకుంపేట: కొట్నాపల్లిలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణ మృతి చెందారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తుండగా గుండెపోటు రావటంతో కుప్పకూలిపోయాడు. వెంటనే కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందించి విశాఖ పట్నంలో ప్రవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రవేట్ ఆసుపత్రిల్లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొట్నాపల్లిలో విధులు నిర్వహిస్తున్న వీఆర్వో స్వగ్రామం పాడేరు మండలం దేవాపురం. ఆయనకు ఇద్దరు పిల్లలు భార్య ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న తాసిల్దార్ రాజలక్ష్మి, రెవెన్యూ శాఖ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

5న ఇళ్ల పట్టాలు పంపిణీ



విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రాజెక్ట్ అడ్మిన్ స్టేటర్ పోలవరం నీటిపారుదల ప్రాజెక్ట్ రాజమహేంద్రవరం అధికారి ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ చింతూరు వారి ఆదేశాల మేరకు విఆర్ పురం మండలం నందుగల 41 వ కాంటూర్ ఆర్ అండ్ ఆర్ గ్రామాలైన కొల్లూరు కొండేపూడి పోచవరం తుమ్మలేరు చోక్కనపల్లి గిరిజన నిర్వాసితులకు ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం రామన్నగూడెం ఆర్ అండ్ ఆర్ కాలనీ నందు కేటాయించబడిన హౌసింగ్ పట్టాలను 5వ తేదీ ఉదయం 10 గంటలకు రేఖ పల్లి మినీ గురుకులం పాఠశాల ప్రాంగణం నందు గౌరవ శాసన మండలి సభ్యులు అనంత ఉదయ భాస్కర్, శాసనసభ సభ్యులు రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం నాగులపల్లి ధనలక్ష్మి వారి ద్వారా లాంచనముగా ఆర్ అండ్ ఆర్ పట్టా పంపిణీ ప్రారంభించబడుతుందన్నారు.

అష్టలక్ష్మి అమ్మవార్లకు కొలువు



విశాలాంధ్ర -వి.మాడుగుల: మాడుగులలో జాగానివీధిలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శ్రీనాథువెంకట కొండారావు, శ్రీనాథు మోహన్‌రావు నివాస గృహంలో శ్రీనాథు రత్నాలమ్మ, శ్రీనాథు ఐశ్వర్య, శ్రీనాథు ప్రియాంక ఆధ్వర్యంలో వాసవి మాత అమ్మవారితో పాటు ఆదిలక్ష్మి, విద్యాలక్ష్మి, వర లక్ష్మి, ధనలక్ష్మి, ధైర్యలక్ష్మి, ధాన్యలక్ష్మి, గజలక్ష్మి, విజయలక్ష్మి, సంతానలక్ష్మి అమ్మవార్లకు కొలువు ఏర్పాటు చేశారు.

పౌష్టికాహారం పంపిణీ చేయాలి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి వచ్చిన ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి గర్భిణీలందరికి పౌష్టికాహారం అందించాలని తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గర్భిణీలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

విశాలాంధ్ర - అడ్డతీగల: స్థానిక సెయింట్ మేరీస్ కాన్వెంట్‌లో చదువుతున్న రేలంగి విజయదుర్గా ఆదిత్య నవోదయ 2వ విడత ఫలితాలలో ఎంపిక అయినట్లు సెయింట్ మేరీస్ ప్రిన్సిపాల్ మెనీ మోల్ తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే నవోదయ పరీక్షకు సంవత్సరానికి ఒకరు చొప్పున ఎంపిక అవుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అందువల్ల ఈ సంవత్సరం ఎంపికైన విద్యార్థిని సన్మానించడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు.

జగనన్న కాలనీలో నూతన గృహం ప్రారంభం

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలంలోని తామరం జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తయిన కోనేటి లక్ష్మమ్మ ఇంటిని శుక్రవారం తూర్పు కాపు సంఘం మండల అధ్యక్షులు గొంతిన హరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలతో పేదలకు సొంత గూడు కల నెరవేరిందన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం హామీలను నెరవేర్చుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రసాద్, పాస్టర్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పెంటకోట జగదీష్

విశాలాంధ్ర - వి.మాడుగుల: భారతీయ జనతా పార్టీ అనకాపల్లి జిల్లా కీలకమైన సోషల్ మీడియా కన్వీనర్‌గా కస్సా జగన్నాథపురం గ్రామానికి చెందిన పెంటకోట జగదీష్ నియమితులయ్యారు. గురువారం విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర ఐటీ, సోషల్ మీడియా కన్వీనర్ల సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రకటించారు. ఈ సందర్భంగా పురందేశ్వరికి, జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావుకి, జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, పుట్టా గంగయ్యకి, పుట్టా రాంబాబుకి, మండల సంతోషి సుబ్బలక్ష్మికి, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కృష్ణకాంత్‌కి ధన్యవాదాలు తెలిపారు. గ్రామ ప్రజలు తమ గ్రామ యువకుడికి బిజెపిలో కీలక పదవి రావడంతో అభినందనలు తెలిపారు.

సచివాలయానికి ఫైబర్ నెట్

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి సచివాలయంలో నెల రోజులుగా నెట్ సౌకర్యం లేక పనులన్నీ కూడా మూలన పడ్డాయని, జగనన్న సురక్షలో పెట్టుకున్న దరఖాస్తులకు ఇప్పటి వరకు సమాధానం లేదని, చేయూతలో సర్టిఫికెట్లు ఆగిపోయాయని నెట్ లేక లోదొడ్డి సర్పంచ్ లోత రామారావు తెలిపారు. సచివాలయానికి వచ్చి ప్రజలు ఏ సమస్య చెప్పిన సరైన సమాధానం లేదని తెలిపారు. ఇప్పటికైనా తక్షణమే నెట్ సౌకర్యాన్ని పునరుద్ధించాలని, లేనిపక్షంలో ప్రాజెక్ట్ అధికారి, జిల్లా కలెక్టర్ వారికి ఫిర్యాదు చేస్తామని రామారావు అన్నారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థులు

విశాలాంధ్ర - చింతపల్లి :- తప్పిపోయారని వాట్సాప్ గ్రూప్ లలో హల్ చల్ కాబడిన స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ వసతి గృహ విద్యార్థినిలు సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చమని స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక పాత్రికేయులతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ వసతి గృహ నిర్వాహకులకు ఉపాధ్యాయులకు చెప్పకుండా బయటకు వెళ్లిన ముగ్గురు విద్యార్థినిల విషయమై ప్రధానోపాధ్యాయుడు కొండలరావు పిర్యాదు మేరకు వసతి గృహం నుంచి వెళ్లిపోయిన బాలికలను వెతికి వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందన్నారు. సంఘటనకు సంబంధించి ఆయన అందించిన వివరాలు యిలా ఉన్నాయి.గత నెల 27 న ఉపాధ్యాయులకు చెప్పకుండా వసతి గృహం నుండి బయటకు వెళ్లిన బలపం పంచాయతీ వీరవరం గ్రామానికి చెందిన 6వ,తరగతి చదువుతున్న పాంగి గీత(10),పాంగి గాయత్రి(11), జి మాడుగుల మండలం పాల మమిడి గ్రామానికి చెందిన 5వ తరగతి చదువుతున్న గెమ్మిలి నీరజ(11) లు వసతి గృహం నుంచి బయటకు వచ్చి స్థానిక టీ జంక్షన్ వద్ద ఉండగా కందుల గాది గ్రామానికి చెందిన ఆ విద్యార్థినుల బంధువు కాంతమ్మ వారిని గుర్తించి ఆ రాత్రి తమ ఇంటిలో ఉంచుకుందన్నారు. మరుసటి రోజు ఆమె చింతపల్లి వస్తూ పిల్లలను చింతపల్లి తీసుకువచ్చి వసతి గృహానికి వెళ్లాలని సూచించి తన పని నిమిత్తం ఆమె వెళ్లిందన్నారు ఈ క్రమంలో విద్యార్థులు వసతిగృహానికి వెళ్లకుండా సాయంత్రం వరకు గ్రామంలోనే తిరిగి రాత్రికి యధాప్రకారంగా కాంతమ్మ ఇంటికి చేరుకున్నారన్నారు. ఈ విషయం తెలియని పాఠశాల యాజమాన్యం విద్యార్థుల గురించి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు చింతపల్లి చేరుకుని వారి పిల్లల ఆచూకీ కోసం వెతుకులాట మొదలు పెట్టారన్నారు. విషయం వాట్సాప్ గ్రూపులలో హల్చల్ చేయడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండలరావు అప్రమత్తమై తమకు ఫిర్యాదు చేయడం జరిగింది అన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర క్రీడాకారులు రాణించాలి

నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు ఎదగాలని అందుకు అవసరమయ్యే మౌలిక వసతులు జీవీఎంసీ కల్పిస్తుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. శుక్రవారం ఆమె ఎంవిపి కాలనీ స్పోర్ట్స్ హరీనా లో ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ సబ్ జూనియర్ బ్యాట్మింటన్ ఛాంపియన్షిప్ - 2023 ను జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ, జిల్లా షటిల్ బ్యాట్మింటన్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, జిల్లా జనరల్ సెక్రెటరీ పల్లా శ్రీనివాస రావు, సిఎఫ్ఓ చుక్కల శ్రీనివాసరావు, ఆర్గనైజర్ కార్యదర్శి ఉష శ్రీ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రతి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. క్రీడల్లో పివి సింధు హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ లాంటి వారిని ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తీసుకు రావాలన్నారు. క్రీడల వలన మనసు ప్రశాంతత, శారీరక, మానసిక ఆందోళనలో తొలగిపోతాయని తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుండి దాదాపు 300 మంది చిన్నారులు సెప్టెంబర్ 3వ తేదీ వరకు క్రీడలలో పాల్గొంటున్నందున వారందరికీ మేయర్ అభినందనలు తెలియజేశారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి సహకారంతో జీవీఎంసీ పరిధిలోని ప్రతి జోన్లో క్రీడా మైదానంలో అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో అంతర్జాతీయ క్రీడలు ఆడేందుకు అన్ని మౌలిక వసతులు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను ఎంచుకొని అందులో రాణించాలన్నారు. నగర పరిధిలో స్వర్ణ భారతి స్టేడియం, బీచ్ రోడ్ లోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్, అలాగే అనకాపల్లి, గాజువాక ప్రాంతాలలోనూ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్సు ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలలో అభివృద్ధి పరిచేందుకు పెద్ద ఎత్తున ప్రణాళికలు రూపొందిస్తు న్నామన్నారు. విశాఖ నగరానికి విచ్చేసిన ప్రతి క్రీడాకారులకు జీవీఎంసీ స్వాగతం పలుకుతుందని కమిషనర్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ వంశీకృష్ణ, సెక్రటరీ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అల్లుడికి వేల కోట్ల దసపల్లా హిల్స్...కూతురికి 100 కోట్లతో విలాసవంతమైన విల్లా

విశాఖలో విజయసాయి రెడ్డి అక్రమాలకు అంతే లేదు... జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపణలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : వేల కోట్ల రూపాయల విలువచేసే వివాదాస్పద దసపల్లా భూములను కొట్టేసిన రాజ్యసభ సభ్యుడు పి విజయ్ సాయి రెడ్డి అక్రమాలకు అంతే లేకుండా పోతుందని 22 వార్డు జెనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. శుక్రవారం ఓ హెూటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కశింకోట మండలం విస్సన్నపేటలో వేసిన వివాదాస్పద లే అవుట్ లో 60 ఎకరాలను బహుమతిగా పొందిన విజయసాయిరెడ్డి, మధురవాడ శ్రీరామ్ ప్రాపర్టీస్ ఎదురుగా ఉన్న ఐకానికా ప్రాజెక్ట్ స్థలంలో 100 కోట్ల రూపాయలతో తన కుమార్తె నేహా రెడ్డికి 5076 గజాల్లో అత్యంత విలాసమైన విల్లాన్ని కట్టి పెడుతున్నారన్నారు. విజయ సాయి రెడ్డి ఉత్తరాంధ్ర ఇంచార్జిగా వ్యవహరించిన సమయంలో ఈ డీల్ కుదరటం, విఎంఆర్డిఏ జీవీఎంసీలు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులన్నీ మంజూరు చేయించుకున్నారన్నారు. మధురవాడ సర్వేనెంబర్ 386/ పి , ఎండాడ సర్వేనెంబర్ 1/పి ల పరిధిలోకి వచ్చే 5076 గజాల స్థలం విజయ్ సాయి రెడ్డి అల్లుడు కి చెందిన అవ్యాన్ రియాల్టర్స్ ఎల్ ఎల్ పి కి 2021 ఏప్రిల్ లో రిజిస్ట్రేషన్ అయిందన్నారు. విజయ సాయి రెడ్డి నివాసం ఉండే శ్రీరామ్ ప్రాపర్టీస్ ఎదురుగానే ఆ స్థలం ఉండటం గమనార్హం అని, అప్పటివరకు ఖాళీగా ఉన్న ఈ స్థలంలో వైయస్సార్ కాంగ్రెస్ శాసన సభ్యుడు కొట్టు సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఐకానికా ప్రాజెక్ట్ పేరిట వెంచర్ ప్రారంభమైందన్నారు. ఈ స్థలం విజయ సాయి రెడ్డి పరం కాగానే కొట్టు సత్య నారాయణ రాష్ట్ర మంత్రి అయిపోయారని, విఎంఆర్డిఏ రికార్డ్ స్థాయిలో ఏడు రోజుల్లో అన్ని రకాల అనుమతులను నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేసేసిందన్నారు. ఈ అను మతులు కారణంగా జీవీఎంసీకి కోట్ల రూపాయల కాలి స్థలం పన్ను (వీ ఎల్ టి) ని కోల్పోయిందన్నారు. పూర్తి స్థాయి రాజకీయం తప్ప చెప్పుకోదగ్గ వ్యాపారాలు ఏమీ చేయని విజయ్ సాయి రెడ్డికి ఆయన కుమార్తెకు వందలు, వేల కోట్ల రూపాయలు ఆస్తులు ఆయన రాజ్యసభ సభ్య లుగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఎలా వచ్చాయో ముఖ్యమంత్రి విచారణ జరపించాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు.

అర్చకుని దహన సంస్కారాలకు ఆర్థిక సహకారం

విశాలాంధ్ర - చోడవరం : మండలంలోని లక్కవరం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ భీమలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో అర్చకునిగా విధులు నిర్వహించిన శ్రీ రాంబిల్లి సూర్యనారాయణ స్వర్గస్తులైనందున దహన సంస్కారాలు నిమిత్తం రూ.10,000లు వారి కుమారుడైన రాంబిల్లి నాగేశ్వరరావుకు శుక్రవారం గ్రామ సర్పంచ్ శీరంరెడ్డి వెంకటరమణ సమక్షములో అందజేసారు. ఆలయ ఈ.ఓ. ఎస్.వి.వి. సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ శాఖా పరంగా అర్చకునికి రావలసిన రాయితీలను అందజేస్తామన్నారు.

పెంచిన ఛార్జీలు వెంటనే తగ్గించాలి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : పోలవరం నిర్వాసిత సమస్యలు పరిష్కారం చేయాలని పెంచిన విద్యుత్ చార్జీలు నిత్యావసర ధరలు తగ్గించాలని మెగా డీఎస్సీ ప్రకటించాలని సిపిఎం ఆధ్వర్యంలో రాజుపేట వడ్డిగూడెం జీడి గుప్పా రేఖ పల్లి సచివాలయాలవద్ద ముట్టడి చేశారు. ఆనంతరం వివిధ సమస్యలు తో కూడిన వినతి పత్రాన్ని నాయకులు ఎంపిపి సర్పంచ్ అధ్వర్యంలో ఆయా కార్యదర్శులకు వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ మండల నాయకులు పంకు సత్తిబాబు తాతాబాబు రెడ్డి గుండె పూడి లక్ష్మణ్ రావు కాంతారావు ప్రకాశ రావు కృష్ణా రెడ్డి ఛంద్రరావు నేర్రి బోయిన రాజుసోడి మల్లయ్య వీర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థి మృతి

విశాలాంధ్ర - చింతపల్లి : స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న జీకే వీధి మండలం ఆసరాడ గ్రామానికి చెందిన కౌశిక్ కుమార్ విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పాఠశాల ప్రిన్సిపాల్, మృతుని కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న కౌశిక్ కుమార్ ఆరోగ్యం విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఆ బాలుడిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కింగ్ జార్జ్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు సెయింట్ ఆన్స్ ప్రిన్సిపాల్ తెలిపారు

నేడు శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుని జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి : ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలం దిస్తున్న జివిఎంసి 93వ వార్డు పరిధిలో గల శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకర్రావు '92వ జయంతి'ని సెప్టెంబరు 2న ఘనంగా నిర్వహించ నున్నట్లు ఆసుపత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ (పిఆర్ లైజన్) కె.బంగార్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా పలువురు ప్రముఖులు, వైద్యనిపుణులు శంకర్‌రావు విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిస్తారని, తర్వాత శంకర్ ఫౌండేషన్ అభివృద్ధిలో కీలక భాగస్వా లైన స్వచ్ఛంద సంస్థలు, విజన్ కేంద్రాలు, మూడు జిల్లాలోని అనేక గ్రామాల్లో నిరుపేదలకు ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించి శంకర్ ఫౌండేషన్‌కు వెన్నుగా నిలిచి, వారి జీవితాల్లో వెలుగునిచ్చిన వారందరినీ ఈ సందర్భంగా సత్కరిస్తామని ఆయన వెల్లడించారు. ఆసుపత్రి సాధించిన ప్రగతి గురించి, సమాజానికి చేస్తున్న సేవల గురించి వారికి సవివరంగా తెలియ జేస్తామని ఆసుపత్రి అభివృద్ధిలో భాగస్వాములైన వారి సేవలను మరింత విస్తృత పరిచే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బంగార్రాజు తెలియచేసారు.

అక్రమ అరెస్ట్లకు భయపడేది లేదు

విశాలాంధ్ర - చీడికాడ : మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు అక్రమ అరెస్ట్ పిరిగి బంద చర్య అని మాజీ యం యల్ ఏ గవిరెడ్డి రామానాయుడు అన్నారు. అయ్యన్న ఇలాంటి అరెస్టులకు భయపడే వ్యక్తి కాదన్నారు. రాష్ట్రంలో దుర్మార్గపు ముఖ్యమంత్రి పరిపాలన తెలియని వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది జగన్ జగన్మోహన్ రెడ్డి అని ఆరోపించారు. మీనాయకులు మానాయకుడు చంద్రబాబు నాయుడును అన్నప్పుడు ఇవి గుర్తుకు రాలేదా అని అన్నారు. ప్రజలు తెలుగుదేశం వైపు మొగ్గు చూపు తున్నారని వచ్చే 2024 ఎన్నికలలోలో టిడిపి పార్టీ విజయం ఖాయమన్నారు ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు యంపిటీసి పైలా ముత్యాల నాయుడు గండి ముసలినాయుడు పంచాడ దాలినాయుడు వెంకటరావు గణపతి పాల్గొన్నారు.

కొత్తగా పింఛన్లు మంజూరు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : మండలంలోని వడ్డీ గూడెం గ్రామపంచాయతీ పరిధి గ్రామాలలోని వికలాంగులకు వృద్ధులకు వితంతువులకు కొత్తగా 15 మంది లబ్ధిదారులకు పెన్షన్లు స్థానిక సర్పంచి సోడి నరసమ్మ చేతులమీదుగ శుక్రవారంపంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందని అర్హులైన ప్రతివారికి జగనన్న ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయడం జరిగిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జగనన్న సచివాలయం కన్వీనర్ బొడ్డు సత్యనారాయణ వడ్డుగూడెం సచివాలయ కన్వీనర్ ముత్యాల శ్రీధర్ ముత్యాల సుమన్ పంచాయతీ సెక్రటరీ స్వరూప రెడ్డి సచివాల సిబ్బంది వాలంటీర్లు లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే పంచకర్ల పర్యటన

విశాలాంధ్ర - పరవాడ : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా శనివారం మండలంలో జనసైనికులు చేపట్టబోయే పలు సేవా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొంటారని ఆ పార్టీ నాయకుడు బుగిడి రామగోవిందరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 9గంటలకు లంకెలపాలెం జయ ఫంక్షన్ హాల్లో మాజీ కార్పొరేటర్ దుల్ల రామానాయుడు, జన సైనికుల ఆధ్వర్యంలో తలపెట్టిన చీరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం మడకపాలెంలో మడక రమణ, జనసైనికుల ఆధ్వర్యంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి అక్కడ నుంచి సాలాపువానిపాలెంలో సాలాపు శివ జనసైనికుల ఆధ్వర్యంలో జరిగే చీరలు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అలాగే తాడి, పరవాడ, రావాడ, ఈ.భోనంగి, పెద ముసిడివాడ శివారు గండివాని పాలెం గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు, జనసైనికుల ఆధ్వర్యంలో చేపట్టబోయే సేవా కార్యక్రమాల్లో పంచకర్ల ముఖ్య అతిధిగా పాల్గొంటారన్నారు. మండలంలోని నాయకులు, జన సైనికులు, వీరమహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వ్లాదివోస్టోక్ 'ఫార్ ఈస్ట్ స్ట్రీట్'లో ప్రారంభమైన నార్త్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ : 'ఆత్మ ఆఫ్ రష్యా'. వ్లాదివోస్టోక్ లోని 'ఫార్ ఈస్ట్ స్ట్రీట్ 'లో నార్త్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ఇది స్థానిక మైనారిటీల జీవితం, కళ జీవనశైలికి అంకితం చేయబడింది. 8వ ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరం సందర్భంగా ఈ ఎగ్జిబిషన్ తన పనిని కొనసాగిస్తుంది. 2021-2023లో ఆర్కిటిక్ కౌన్సిల్కు రష్యా అధ్యక్షత వహించే కార్యక్రమాల ప్రణాళికలో భాగంగా ఈ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవాన్ని రోస్కాన్గ్రెస్ ఫౌండేషన్ నిర్వహిస్తోంది. "ది సోల్ ఆఫ్ రష్యా. ఆర్కిటిక్ కౌన్సిల్ కు రష్యా అధ్యక్షత వహించడంలో భాగంగా ప్లాన్ చేయబడిన చివరి కార్యక్రమం ది నార్త్, సైబీరియా మరియు దూరప్రాచ్యంలోని స్థానిక మైనారిటీలకు మరియు వారి గొప్ప, ప్రత్యేకమైన సంస్కృతి మరియు గుర్తింపుకు అంకితం చేయబడింది. రష్యన్ ఫెడరేషన్ యొక్క తొమ్మిది భాగస్వామ్య సంస్థలలో జరిగిన మొత్తం 116 కార్యక్రమాలకు అధ్యక్షత వహించిన రెండు సంవత్సరాలలో 300,000 మంది సందర్శకులు స్వాగతం పలికారు.

ఫాస్ట్రాక్ నూతన ప్రచారకర్తగా నటుడు విజయ్ దేవరకొండ

విశాలాంధ్ర - విశాఖ సిటీ : భారతదేశపు ప్రతిష్టాత్మకమైన వాచ్ యాక్సెసరీస్ బ్రాండ్ ఫాస్ట్రాక్ తమ కొత్త బ్రాండ్ ప్రచారం 'బీ బోల్'తో ముందుకు రానున్నట్లు ఫాస్ట్రాక్ హెడ్ అజయ్ మౌర్య చెప్పారు. ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ ఇప్పుడు ఫాస్ట్రాక్ బ్రాండ్ అంబాసిడర్‌గా కనిపించనున్నారన్నారు. సూక్ష్మ నాటకీయత, పూర్తి ఉల్లాసం, సొగసరి మరియు అనుచితమైన ప్రత్యేక ఫ్యాషన్ వైరుధ్యాల శ్రేణితో కూడిన యువత జీవితాల్లో విభిన్న వాస్తవాల కలయికను ప్రచారం హైలైట్ చేస్తుందన్నారు. ఈ బ్రాండ్ తమ వినియోగదారులను నిస్సంకోచంగా "బీ బోల్" అని ప్రేరేపించడం వారి వైరుధ్యాలను ఉల్లాసంగా ప్రదర్శించడం లక్ష్యంగా పెట్టుకుందని, ఈ ప్రచారం 15 విశిష్టమైన వాచీల కలెక్షన్ ను హైలైట్ చేస్తుందని తెలిపారు.

యూత్ కార్యదర్శిగా చింతకాయల కొర్లయ్య

విశాలాంధ్ర - పరవాడ : సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ కార్యదర్శిగా, ఉత్తరాంధ్ర జిల్లాల ఇంచార్జిగా పరవాడ మండలం ముత్యాలం పాలెం గ్రామానికి చెందిన చింతకాయల కొర్లయ్య నియామక మయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయలు శంకరయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలన్నీ పర్యటించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కొర్లయ్యకు సూచించారు. బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని కోర్లయ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు. తనపై నమ్మకంతో నూతన బాధ్యతలు అప్పగించిన అధ్యక్షుడికి, సహకరించిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

అరకలోయలో భారీ వర్షం

విశాలాంధ్ర - అరకులోయ : అల్లూరి సీతా రామరాజు జిల్లా అరకులోయ మండలంలో శుక్రవారం సాయంత్రం రెండు గంటల పాటు భారీ కుండపోత వర్షం కురిసింది. దీంతో వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు తీరుగు ప్రయాణంలో పలు ఇబ్బందులు పడ్డారు. మ్యూజియం, పద్మావతి గార్డెన్, తిరగించడానికి వచ్చిన పర్యాటకులు వర్షంతో అవస్థలు పడ్డారు. అరకులోయ మండల కేంద్రంలో ప్రధాన రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే రోడ్డులో వర్షం నీరు నిలువ ఉండిపోవడంతో వాహనదారులు పాదచారులు ఇబ్బంది ఎదుర్కోవాల్సి వచ్చింది. గత రెండు వారం రోజుల నుండి వర్షాలు లేక ఎండ తీవ్రతకు ఉక్కపోతకు గురైన మండల వాసులు ఈ వర్షంతో వాతావరణం చల్లబడడంతో కొంత ఉపశమనం కలిగించింది. ఈ వర్షంతో మండలంలో పలు ప్రాంతాలలో వాగులు పంట పొలాలకు నీటితో నిండిపోయాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త ఫింఛన్లు పంపిణీ చేసిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - పెందుర్తి : జీవిఎంసి 93వ వార్డు, 489 సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన ఫింఛన్లను స్థానిక వైసిపి నాయకులు కార్తీకవర్మ, రాపర్తి సత్తిబాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందచేసారు. ఈ సందర్భంగా కార్తీకవర్మ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని, పార్టీలు, వర్గాలకతీతంగా పేదలందరికి సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు. లబ్ధిదారులు జగన్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో అడ్మిన్ భాలభారత, వెల్ఫేర్ అధికారి లావణ్య వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడుపై అక్రమ కేసులు అన్యాయం : బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడును ప్రతిసారి వైసీపీ ప్రభుత్వం కుంటు సాకులతో అక్రమ కేసులు బనయి స్తున్నారని అందులో భాగంగానే శుక్రవారం కృష్ణాజిల్లా పోలీసులు 41 ఏ నోటిఫికేషన్ ఇవ్వడానికి అరెస్టు చేయవలసిన అవసరం ఏమొచ్చిందని, ఇది అమానుషమని ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించవలసిన అవసరమని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు పోలీసులు చర్యలను తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రిని, రోజా, ను గన్నవరం యువగళం పాదయాత్ర జరుగుతున్న బహిరంగ సభలో అయ్యన్నపాత్రుడు అనుచిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని పోలీసులకు ఆ నియోజకవర్గానికి సంబంధంలేని పేర్ని నాని తో ఫిర్యాదులు చేశారని పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమైన చర్యని నీతిమాలిన చర్యగా నాగ జగదీష్ అన్నారు. వైసిపి ప్రభుత్వం నూటికి నూరు శాతం శాసనసభలోనే ప్రతిపక్ష పార్టీ సభ్యులు పైన వారి కుటుంబ సభ్యుల పైన కొడాలి నాని, పేర్ని నాని, ఆర్కే రోజా, అంబటి రాంబాబు చట్టసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఈ బూతు మంత్రులపై ఏనాడైనా చర్య తీసుకున్నారని చట్టం ప్రతిపక్షాలకే గాని పాలక పక్షానికి చుట్టమా నాగ జగదీష్ ప్రశ్నించారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుండి పోలీసులు అడ్డం పెట్టుకొని ప్రతిపక్షాలను ఉద్యోగస్తులు ఉపాధ్యాయులు, ప్రజాతంత్ర వాదులపై ప్రభుత్వ వ్యతిరేకతను ప్రశ్నించే వారి గొంతులను నొక్కుతున్నారని ఇది ముమ్మాటికి జగన్ రెడ్డి అధికార దుర్వినియోగమని, జగన్ రెడ్డి పాదయాత్ర సమయంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నడిరోడ్డుపై కాల్చి చంపాలని, రాళ్లతో కొట్టాలని, బంగాళాఖాతంలో విసిరివేయాలని ఆనాడు ప్రజలను రెచ్చగొట్టిన విషయం మరిచి పోయి, నేడు తెలుగుదేశం పార్టీ నాయకులు పైన కార్యకర్తల పైన అక్రమ కేసులతో కాలయాపన చేస్తూ అభివృద్ధి మరిచిపోయి ప్రతిపక్షాలను బెదిరించే స్థాయికి జగన్ రెడ్డి ప్రభుత్వం దిగజారి పోయిందని నాగ జగదీశ్ వ్యాఖ్యానించారు. విలేకరుల సమావేశంలో కడిమిశెట్టి నరసింహా రావు కోట్ని రామకృష్ణ బోడి వెంకటరావు బర్నికాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారులు సైతం ప్రమాద భరితం

తెదేపా అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగభూషణం

విశాలాంధ్ర - చింతపల్లి : వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రధాన రహదారులన్నీ ప్రమాద భరితంగా తయారయ్యాయని తెదేపా అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి రహదారుల నిర్మాణం చేపట్టక పోగా, తెదేపా హయాంలో నిర్మించిన ప్రధాన రహదారులకు ఈ ప్రభుత్వంలో సైతం కనీస మరమ్మత్తులు చేపట్టలేదున్నారు. ప్రమాదాల నివారణకు తెదేపా హయాంలో స్పీడ్ బ్రేకర్ లు ఏర్పాటు చేస్తే, అదే ప్రమాదాల నివారణకు వైకాపా ప్రభుత్వం నిధులను ఖర్చు చేయడం వృదా అని భావించి రహదారులను గుంతల మయంగా ఉంచి ప్రమాదాలను నివారించే ప్రయత్నం చేస్తుందేమోనని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ గుంతలే ప్రయాణికుల, వాహన చోదకుల పాలిట గుడిబండలుగా ప్రమాద భరితంగా తయారయ్యాయని ఆయన ఆరోపించారు. ప్రజల సౌకర్యార్థం రహదారులు కల్పించలేని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మన్య ప్రాంతాల్లో సహజ సిద్ధంగా నిక్షిప్తమై ఉన్న గనులను తరలించుకుపోయేందుకు విశాలమైన రహదారులను నిర్మించుకుంటున్నాయని, ఈ పరిస్థితులను ప్రజలు గమనిస్తున్నారని రాబోవు సార్వత్రిక ఎన్నికలలో ఈ ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాతం చెబుతారని ఆయన జోష్యం చెప్పారు.

సర్పంచ్‌పై దాడిని ఖండించాలి : టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర - మారేడుమిల్లి : మండలంలోని పుల్లంగి పంచాయతీ సర్పంచ్ వీరవల్లి జార్జి బాబుపై జరిగిన దాడిని తెలుగుదేశం పార్టీ నాయకుడు నాయకుడు డాక్టర్ పి రాజ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామ సభ అనేది చర్చించుకుని గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం పంచాయతీ సెక్రెటరీ వార్డు సభ్యులు గ్రామస్తులు సమక్షంలో గ్రామ సభ నిర్వహిస్తారని, సర్పంచ్ తప్పులు ఉంటే జవాబు దారితనం ఉంటుందని, పంచాయతీలో అవినీతి జరిగితే పంచాయతీ సెక్రెటరీ పై సచివాలయ సిబ్బందిపై బాధ్యత ఉంటుందని, వారిని కూడా సంప్రదించాల్సి ఉంటుందని, అలాకాకుండా కావాలని కక్షపూరితంగా టిడిపి పార్టీ తరఫున సర్పంచ్ అయినందుకు దాడి చేయడం తగదని, గుడిసె పర్యాటక ప్రాంతం అటవీశాఖ, ఐ టి డి ఏ, జిల్లా కలెక్టర్ అనుమతితో టూరిజం నడుస్తుందని, సర్పంచ్ సమాదానం ఇవ్వనప్పుడు వైసిపి నాయకులు జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయాలి తప్ప, ప్రశాంతమైన ఏజెన్సీ ప్రాంతాన్ని దాడుల వలన ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని రాజకీయం ఎలక్షన్లసమయంలో చూపించాలని పార్టీలకతీతంగా పని చేయాలి తప్ప దాడులు చేయడం సమంజసం కాదని, ఈ దాడి వెనుక వైసిపి మండల నాయకులు ప్రోత్సాహం ఉంటుంది. దాడి చేసిన వారిని ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇలాంటి సంఘటనలు కాకుండా పోలీస్ డిపార్ట్మెంట్ వారు బాధ్యత వహించాలని రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ పి రాజ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

పెంచిన విద్యుత్ చార్జీలతో పాటు, ప్రైవేటీకరణను ఆపాలి

సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దహనం

విశాలాంధ్ర - కొమ్మది : రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా పెంచిన విద్యుత్ చార్జీలు.రకరకాలుగా అనేక రూపాల్లో విద్యుత్ భారాలు వేయడం ఆపాలని సీపీఎం మధురవాడ జోన్ కమిటీ డిమాండ్ చేసింది. జీవిఎంసి 6వ వార్డు కమాధి ఎస్సి కాలని 36వ సచివాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.ప్ల కార్డులు ప్రదర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.భారీగా పెంచిన విద్యుత్ చార్జీలు, ప్రైవేటు కారణ ఆపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విద్యుత్ బిల్లులను మంటలలో వేసి కాల్చి నిరసన తెలియజేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల కు నిరసనగా ఈ నెల 4వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 4న విశాఖ రూరల్ తాహసిల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలియ జేశారు.ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ధర్నా అనంతరం సచివాలయం కార్యాదర్శి కి సంతకాలతో కూడిన వినతి పత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు, కార్యకర్తలు కే.పుష్ప, డి.తులసి, బంగార్రాజు, ఎస్.రేణుకా, కృష్ణమ్మ, ఎస్.అప్పలరాజు,బంగారాజు తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణమాస పూజలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని వన్ టౌన్ కురుపాం మార్కెట్ ప్రాంతంలో గల కన్యకా పరమేశ్వరి దేవాలయంలో జరుగుతున్న శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మడవ శుక్రవారం నాడు అమ్మవారు ముత్యాల వస్త్రాలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు .ఆలయంలో అమ్మవారి మూల విరాట్ కు తెల్లవారుజామున 5 గంటలకు శుద్ధజలం,పాలు,పెరుగు తేనె, గంధం, పసుపు, కుంకుమ వంటి 108 ద్రవ్యములు మరియు వివిధ రకాల పండ్ల రసాలతో ప్రత్యేక క్షీరా భిషేకం నిర్వహించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు 108 స్వర్ణ పుష్పములతో ప్రత్యేకముగా నివేదన గావించి అమ్మవారిని ముత్యాల వస్త్రాలంకరణలో అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించినట్లు దేవాలయ సంఘ అధ్యక్షులు శ్రీయుతులు ఆరిశెట్టి దినకర్,గ్రంధి రామకృష్ణా రావు తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక లలితాసహస్రనామ పారాయణం చేసిన పిదప దేవస్థాన ఆస్థాన పురోహితులు ఆర్.బి.బి. కుమార శర్మ నేతృత్వంలో సుమారు 350 మంది మహిళలచే సామూహికంగా నవపుష్పాల పూజ (తొమ్మిది రకాల పువ్వులతో) నిర్వహించి క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు, సామూహిక పూజలు చేసిన మహిళలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. సామూహిక పూజలకు కావలసిన సామాగ్రి యావత్తు దేవస్థానం వారే ఉచితంగా సమకూర్చినట్లు దేవస్థాన సంఘ కోశాధికారి సుగ్గు శివ కుమార్ తెలిపారు .దేవాలయమునకు విచ్చే సిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి దేవస్థానం శ్రావణమాస ఉత్సవ కమిటీ చైర్ పర్సన్స్ వేదా కవిత, కొత్తా సాహిత్య దేవాలయ సంఘ మహిళా విభాగం అధ్యక్షురాలు కట్టమీద ప్రసన్న, సంఘం మహిళా విభాగం సభ్యులు కుంచం సత్యవతి మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందే విధంగా నా వంతు కృషి చేస్తా : ఆడారి

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 92 వ వార్డు 477 పరిధిలో గల ఇందిరానగర్ లో జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఏపి. ఎమ్మెస్.ఎన్. ఇ.డి.సి చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ సుమారు 400 మంది లబ్ధిదారులకు జగనన్న బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందే విధంగా తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 91 వ వార్డు అధ్యక్షులు గుని శెట్టి శ్రీనివాసరావు, 92వ అధ్యక్షులు జి. అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, కంపర సత్తిబాబు, ఊటపల్లి గోవిందు, కంపర కోటీశ్వరరావు, మార్కండేయ రాజశేఖర్, కొమ్మనాపల్లి త్రినాథ్, కోనేటి శ్రీను, దాసరి శ్రీను, జీవి రమణ, లోకేష్ రెడ్డి, కిషోర్, కమలాదేవి, అనురాధ, ఓరుపల్లి విజయ, జ్యోతి, వరలక్ష్మి, సువర్ణ వెంకటరమణ, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు కన్వీనర్లు, ఆర్పీలు, వివిధ అనుబంధ సంస్థల మహిళలు, సచివాలయం సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో వివాహిత మృతి

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం మండలం రేవళ్ల గ్రామ సమీపంలో శుక్రవారం గ్రావెల్ లోడ్ తో వస్తున్న ట్రాక్టర్ ఢీ కొనడంతో వేచలపు లక్ష్మి (55) అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు భర్త, పోలీసులు అందించిన వివరాల ప్రకారం కోటపాడుకు చెందిన వేచలపు గోవిందరావు, లక్ష్మి చోడవరం లో పని ముగించుకుని తిరిగి వెళుతుండగా గ్రావెల్ రాయి లోడుతో గవరవరం నుంచి చోడవరం వైపు అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్, గోవిందరావు నడుపుతున్న స్కూటీని ఢీకొనడంతో వెనుక కూర్చున్న భార్య సంఘటన స్థలిలోనే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు భర్త గోవిందరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

288 కొత్త పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట : పాయకరావుపేట మండలంలో 288 కొత్త పింఛన్లు సెప్టెంబర్ నెల నుంచి పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే గొల్ల బాబురావు చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు తెలిపారు. పాత పింఛన్లు 12,681 కలుపుకొని మండలంలో మొత్తం 12,969 పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 3 కోట్ల 46 లక్షల 27 వేల 500 రూపాయలు పింఛను దారులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో జడ్పిటిసి లంక సూర్యనారాయణ, ఇసరపు తాతారావు, ఈవోపీఆర్డి వై. సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.